ప్రజాశక్తి

మంగళవారం 9 సెప్టెంబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

మెడికల్ కళాశాలలపై దుష్ప్రచారం తగదు

- ప్రభుత్వ ఆధీనంలోనే మచిలీపట్నం కళాశాల
- మంత్రి కొల్లు రవీంద్ర



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం మెడికల్ కళాశాల ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని ఆర్అండ్‌బి అతిథి గహంలో మంత్రి రవీంద్ర సోమవారం మీడియాతో మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో అభివద్ధి చేయడానికి, ప్రైవేటు పరం చేయడానికి మధ్య తేడా వైసిపి నేతలకు తెలియడంలేదన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రభుత్వం పిపిపి పద్ధతిలో తక్కువ ఖర్చుతో అభివద్ధి చేస్తుంటే.. చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మచిలీపట్నం మెడికల్ కళాశాల పనులు వైసిపి ప్రభుత్వ హయాంలో 30 శాతం చేస్తే... కూటమి ప్రభుత్వం వచ్చాక 55 శాతం పనులు పూర్తి చేశామన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నామమాత్రంగా తరగతులు ప్రారంభించగా, తాము పూర్తిస్థాయిలో తరగతులు ప్రారంభించామని తెలిపారు. వైసిపి పాలనలో పీజీ కోర్సులకు మంజూరైన నిధులు కూడా దారి మళ్లించారని విమర్శించారు. ప్రజలకు ఉన్నత వైద్య విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడే 1986లో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటైందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 22 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, జగన్మోహనరెడ్డి ఎన్ని కళాశాలలు ఏర్పాటు చేశారో (మిగతా 2లో)

కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి పిఎసిఎస్ వద్ద బారులు తీరిన రైతులు



యూరియా కోసం పరుగులు

వార్త 5లో

గోదాముల వద్ద ఉదయం నుంచే బారులు తీరుతున్న రైతులు

జల జీవన్ మిషన్ మరింత ఆలస్యం !

- ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రణాళికల్లో మార్పులు
- డిపిఆర్ తయారీకి రేడియంట్ టెక్నాలజీ సర్వే
- రూ.5,944.7 కోట్లతో ప్రాధమిక నివేదిక



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఆక్వా సాగు విస్తరించిన పలు ప్రాంతాల్లో తాగునీటి వనరులు కలుషితమయ్యాయి. వేసవి వచ్చిందంటే కృష్ణానది, సముద్ర తీర ప్రాంతాల్లో గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటికి అవస్థలు పడాల్సి వస్తోంది. జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కారిస్తామని, ఇంటింటికీ కుళాయి నీరు అందిస్తామని ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటి మూటలుగా మారుతున్నాయి. తొమ్మిదేళ్లుగా జలజీవవన్ మిషన్, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులు నామమాత్రంగానే జరగడం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. 2017లో ప్రారంభమైన జనజీవన్ ప్రాజెక్టుకు ప్రభుత్వాలు మారినప్పడల్లా ప్రణాళికలు మారుతున్నాయి. తాజాగా వాటర్ గ్రిడ్‌కు మరోసారి సమగ్ర నివేదిక (డిపిఆర్)కు సర్వే జరుగుతోంది. సర్వే సంస్థ రూ.5944.7 కోట్లతో ప్రాధమిక నివేదిక అందించింది. ఈక్రమంలో కాలయాపన లేకుండా ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

వాటర్ గ్రిడ్ ప్రణాళికలు ఇలా

కృష్ణాజిల్లాలోని 501 గ్రామ పంచాయతీల్లో 3 లక్షల 63 వేల 144 గృహాలున్నాయి. వీటిలో 2 లక్షల 18 వేల 375 గృహాలకు తాగునీటి కుళాయిలున్నాయి. రోజుకు సగటున ఒక్కో మనిషికి 50 లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంకా లక్షా 44 వేల 769 గృహాలకు కుళాయిలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక్కో మనిషికి 75 లీటర్ల వరకు నీటిని అందించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కాల్వల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటినే చెరువుల్లో నింపుకుని తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాల్సిన దుస్థితి ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఎన్‌టిఆర్ జిల్లా సూరాయపాలెం వద్ద ప్రకాశం బ్యారేజీ నుండి నీటిని పైప్‌లైన్ ద్వారా ఒక్కో నియోజకవర్గంలో ఏర్పాటు చేసే మూడు నుంచి ఆరు ట్యాంకులకు నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

2017 నుంచి 2025 వరకు ఇలా

2017లో అప్పటి ప్రభుత్వం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇంటింటికీ కుళాయికి ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే టెండర్ల పిలవడంలో తీవ్ర జాప్యం చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రణాళికలను పూర్తిగా మార్చేసింది. జలజీవన్ మిషన్ (జెజెఎం) పథకంలో భాగంగా కృష్ణాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.1,726.59 కోట్లతో 2313 పనులు నిర్వహించనున్నట్లు 2022 నవంబర్ 21న ప్రకటించింది. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి 135 కోట్లా 41 లక్షల 93 వేల రూపాయల విలువైన 455 పనులు మాత్రమే పురోగతిలో ఉన్నాయి. ఈ కాలంలో గత ప్రభుత్వం జల జీవన్ పథకానికి అవసరమైన రాష్ట్ర వాటా నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొత్తం పనుల్లో 10 పనులను రద్దు చేసింది. తాజాగా తిరిగి మరోసారి వాటర్ గ్రిడ్‌కు సమగ్ర నివేదిక (డిపిఆర్) రూపొందిస్తోంది. జిల్లాలో చేయాల్సిన పనులకు సంబంధించి రేడియంట్ టెక్నాలజీ కన్సల్టెన్సీ సంస్థ క్షేత్రస్తాయిలో సర్వే నిర్వహించి డిపిఆర్ సిద్ధం చేస్తోంది. ఏడు నెలలు సర్వే నిర్వహించి రూ.5,944.7 కోట్లతో ప్రాధమిక నివేదికను ప్రభుత్వానికి అందించింది. దీన్ని పరిశీలించి ప్రాధమిక నివేదికలో చేయాల్సిన మార్పులను కన్సల్టెన్సీ సంస్థకు ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి మార్పులు చేర్పులు చేయడానికి మరో మూడు నెలలు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించడానికి మరో రెండు నెలలు గడువు పడుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

మునేటిలో ఈతకు దిగి ఒకరు మృతి

మరొకరు గల్లంతు



మృతుడు ఖుద్దూష్.

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం మొగులూరు గ్రామంలోని పామాయిల్ తోట సమీపంలో మునేరు వద్ద ఈతకు వెళ్లి ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు. మునేరు మునిగి మరణించిన వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గాలించి బయటకు తీశారు. మరో వ్యక్తి కోసం ఇంకా గాలిస్తూనే ఉన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... మొగులూరు గ్రామానికి చెందిన నలుగురు ముస్లిం యువకులు సోమవారం మధ్యాహ్న సమయంలో గ్రామ శివారు పామాయిల్ తోట సమీపంలోని మునేరు కృష్ణా నదిలో కలిసే ప్రాంతంలో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరిలో ఇద్దరు మునేటి ఒడ్డున ఉండగా, మరో ఇద్దరు షేక్ ఖుద్దూస్ (24), షేక్ షారూక్ (19) ఈతకొట్టేందుకు మునేటిలోకి దిగి గల్లంతయ్యారు. సమీప ప్రాంతంలో పొలాల్లో పనిచేస్తున్న వారు గమనించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఒడ్డున ఉన్న మిగిలిన ఇద్దరు భయంతో గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పారు. దీంతో కునికినపాడు గ్రామం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి మునేరు కృష్ణానదిలో కలిసే ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. మొగులూరు గ్రామానికి చెందిన అబ్దుల్ షఫీ కుమారుడు షేక్ ఖుద్దూస్ (24) మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు ఖుద్దూస్ ఎసి మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు ఆకస్మికంగా మరణించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గల్లంతైన షేక్ హర్షద్ కుమారుడు షేక్ షారుక్ (19) కోసం ఇంకా గాలిస్తున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు, రెవెన్యూ అధికారులు చేరుకున్నారు. గాలింపు చర్యల కోసం ఎన్‌డిఆర్ఎఫ్ బందాలను రంగంలోకి దించకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం చేస్తున్నారు. చీకటి పడినప్పటికీ గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నవంబర్లో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు

వార్త 2లో

హెల్త్ వర్సిటీ వద్ద నిరసన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఎఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పది మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో కొనసాగిస్తామని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారేపు కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పది మెడికల్ కళాశాలలను పీపీపీ విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి, అధ్యక్షులు జగదీష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలపై దుష్ప్రచారం తగదు

(మొదటి పేజీ తరువాయి)

సమాధానం చెప్పాలని అన్నారు. 17 కళాశాలలు ఏర్పాటు చేసినట్లు హడావుడి చేస్తున్న వైసిపి నేతలు దమ్ముంటే వాటిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో అధ్వానంగా తయారైన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా గాడిన పెడుతోందన్నారు. ప్రజలకు మెరుగైన ప్రయోజనాలు అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు. ఏ మెడికల్ కళాశాలనూ ప్రైవేటీకరించలేదని, పిపిపి పద్ధతిలో తక్కువ ఖర్చుతో అభివద్ధి చేస్తున్నామని చెప్పారు. మెడికల్ కళాశాలల నిర్మాణం గురించి మాట్లాడుతున్న వైసిపి నేతలు... గత ఐదేళ్లలో ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె నాని, జనసేన నాయకుడు మాదివాడ రాము, టిడిపి నగర అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నవంబర్లో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు

విజయవాడలో సాహిత్య సాంస్కృతిక వేడుకలు

విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ సౌజన్యంతో మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీలలో సాంస్కృతిక రాజధాని విజయవాడలో 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు-2025' పేరుతో రెండు రోజుల పాటు సాహిత్య సాంస్కృతిక వేడుకలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల లోగోను సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కవులు, రచయితలు, కార్టూనిస్టుల ఆత్మీయ సమ్మేళనంగా రూపొందుతున్న ఈ ఉత్సవాలలో సాహిత్యం, భాష, సమకాలీన సమస్యలు వంటి వివిధ అంశాలపై సదస్సులు జరుగుతాయి. కవి సమ్మేళనం, పుస్తకావిష్కణలు, సత్కారాలు వుంటాయి. ఈ సందర్భంగా సమకాలీన సమస్యలపై కథ, కవితల పోటీ, పర్యావరణం, సోషల్ మీడియా, ధూమపానం, డ్రగ్స్ వంటి అంశాలపై కార్టూన్లపోటీలు వుంటాయి. మీ రచనలు, స్కిట్స్, ఏకపాత్రల్ని పంపాల్సిన చివరి తేదీ అక్టోబరు 25. పూర్తి వివరాలకు 92464 15150, 83329 03156 నెంబర్లలో సంప్రదించవచ్చు.



లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, చిత్రంలో కలిమిశ్రీ, రాఘవేంద్ర శేఖర్, ఆనంద్ తదితరులు

నేడు అన్నదాత పోరు : వైసిపి



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : యూరియా కొరతపై ఈనెల 9న వైసిపి ఆధ్వర్యాన రైతులతో కలిసి అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాలోని ఆర్‌డిఒలకు వినతిపత్రాలు సమర్పిస్తామని పేర్కొన్నారు. వైసిపి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నందిగామ ఆర్డిఓ కార్యాలయం వద్ద అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులను ఏకం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పరిటాలలో ఉద్రిక్తత

- **జాతీయ రహదారిపై బైఠాయింపు**
- **కంచికచర్ల పిఎస్ ముట్టడి**
- **పోలీసుల హామీతో విమరణ**

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వినాయక విగ్రహం ఊరేగింపు సందర్భంగా తలెత్తిన వివాదంపై బిజెపి, విహెచ్‌పి సోమవారం మండల బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌లో భాగంగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కంచికచర్ల పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. పరిటాల వద్ద జాతీయ రహదారిపై బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళితే... కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో శనివారం వినాయక చవితి ఊరేగింపు వెళుతున్న సమయంలో రాళ్ల దాడి జరిగి ముగ్గురు గాయపడ్డారు. దాడికి కారకులైన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలనే అదే రోజున కొందరు ఆందోళన చేపట్టారు. పోలీసు అధికారుల హామీతో ఆందోళన విరమించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేసి ఆదివారం ఐదుగురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అయితే తమపై ఏకపక్షంగా కేసులు నమోదు చేశారని, తమ ఫిర్యాదుపై కూడా కేసులు నమోదు చేయాలని అరెస్టయిన వారికి సంబంధించిన కుటుంబాలువారు, ఆ ప్రాంతానికి చెందిన వారు స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. అరెస్టు చేసిన తమ వారిని విడిచి పెట్టాలని అర్ధరాత్రి వరకు నిరసన కొనసాగించారు. ఈ నేపథ్యంలో అరెస్టు చేసిన వారికి పోలీసులు 41ఎ కింద నోటీసులు ఇచ్చి అర్ధరాత్రి అనంతరం విడుదల చేశారు. ఆ తర్వాత తమకు అందిన ఫిర్యాదు మేరకు 15 మందిపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. దీంతో వినాయక నిమజ్జనం ఊరేగింపు సమయాన రాళ్లు రువ్విన ఘటనలో పోలీసుల వైఫల్యాన్ని నిరసిస్తూ, రాళ్ల దెబ్బలు తిన్న వారిపైనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ బిజెపి, విహెచ్‌పి కంచికచర్ల మండల బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌లో భాగంగా బిజెపి, విహెచ్‌పి కార్యకర్తలు పరిటాల, కంచికచర్ల గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు. అన్ని దుకాణాలు, హోటళ్లు, బడ్డీ కొట్లను, బ్యాంకులు, విద్యా, ప్రభుత్వ సంస్థలను మూసివేయించారు. కంచికచర్ల పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి మూడు గంటలపాటు నిరసన తెలిపారు. అనంతరం ఆందోళనకారులు పరిటాల ఆంజనేయస్వామి గుడి వద్దకు చేరుకుని రెండు దఫాలుగా జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. తమపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు ఎత్తివేయాలని, దాడికి కారకులైన వారిని తక్షణం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పెద్దఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. పలు దఫాలుగా పోలీసు అధికారులు చర్చలు జరిపి దాడికి పాల్పడిన వారిని మంగళవారం సాయంత్రానికి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని హామీ ఇవ్వడంతో రాత్రి 9 గంటల సమయంలో ఆందోళన విరమించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
పోలీసు కమిషనరేట్ ప్రకటన

ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషరేట్ పరిధిలో 30 పోలీసు యాక్ట్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని, వాటిని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషరేట్ నుండి సోమవారం రాత్రి ప్రకటన వెలువడింది. నందిగామ డివిజన్ కంచికచర్ల పోలీసు స్టేషన్ పరిధిలో నెలకొన్న పరిస్థితుల దష్ట్యా మంగళవారం ఎటువంటి నిరసన కార్యక్రమాలకు అనుమతిలేదని పేర్కొంది.



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు


పమిడిముక్కలం మద్దివాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పమిడిముక్కల : యూరియా పంపిణీపై వైసిపి ఆధ్వర్యంలో ఈనెల తొమ్మిదవ తేదీన జరిగే అన్నదాత పోరు కార్యక్రమంలో అందరు పాల్గొనాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మద్దివాడ గ్రామంలో పోరుబాట పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను కూటమి ప్రభుత్వం బ్లాక్ మార్కెట్కు తరలించి రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. మండల వైయస్సార్ పార్టీ నాయకులు ఎలమంచిలి గణేష్, సౌంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని ఎరువుల బ్లాక్ మార్కెట్పై అన్నదాత పోరు పోస్టర్ను వైఎస్ఆర్సీపీ మండల పార్టీ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. యూరియా కొరతపై రైతులు, రైతు సానుభూతి పరులు, పార్టీ నేతలు ఈ నెల 9 వ తారీఖున అన్నదాత పోరు కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపు ఇచ్చారు. రాష్ట్ర గివెన్స్ సెల్ సెక్రటరీ దేశిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, స్థానిక నేతలు, కృష్ణా జిల్లా జనరల్ సెక్రెటరీ కందుల నాగరాజు, ఎంపీపీ పెయ్యల ఆదాం, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

యూరియా పంపిణీ వివరాలను అందజేయాలి

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో గత సంవత్సరం, ఈ సంవత్సరం, మే నెల నుండి ఆగస్టు నెల వరకు యూరియా పంపిణీ వివరాలను వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుండి యూరియా సరఫరా, పంపిణీ స్థితిగతులపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో మే నెల నుండి ఆగస్టు నెల వరకు, అలాగే ఈ సంవత్సరం మే నెల నుండి ఆగస్టు నెల వరకు యూరియా పంపిణీ చేసిన వివరాలతో పట్టిక తయారు చేసి వెంటనే అందజేయాలన్నారు. వాటిని విశ్లేషించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఈ సంవత్సరం మే నెల నుండి ఆగస్టు నెల వరకు ఎవరెవరు ఎంత యూరియా తీసుకున్నారు వారి వివరాల జాబితా కూడా అందజేయాలన్నారు.

ఆందోళన వద్దు : జిల్లాలో యూరియా సరఫరాపై రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరానికి తగ్గట్టుగా సరఫరా చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి జిల్లాలో రైతులకు సరఫరా చేస్తున్న యూరియా, లభ్యత వివరాలను తెలిపారు. సెప్టెంబర్ నెల ఒకటవ తేదీ నుంచి నేటి వరకు 3,180 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలుపుతూ సోమవారం రాత్రికి మరో 1,371 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నదని, మరో రెండు రోజుల్లో ఇంకొక 1,200 మెట్రిక్ టన్నుల యూరియాను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు

- జిల్లా మలేరియా విభాగం అధికారి బి. రామారావు
- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో జ్వరాల రోగులను గుర్తించి చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాలని జిల్లా మలేరియా అధికారి బి.రామారావు ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజాశక్తిలో ప్రచురితమైన 'పల్లెల్లో విజృంభించిన జ్వరాలు' అనే కథనంపై రామారావు స్పందించారు. సోమవారం గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంను ఆయన తనిఖీ చేశారు. ఓపి విభాగంలో ఉన్న రోగులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను కలిసి వారికి అందుతున్న వైద్యమూ, ఆరోగ్య పరిస్థితిని గమనించారు. విష జ్వరాలు రావడంతో వార్డుల్లో పెట్టి తగిన చికిత్సలు చేస్తున్నామని డాక్టర్ సల్మా ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం రక్త పరీక్ష కేంద్రాన్ని, ఇంజక్షన్లు చేసే విభాగాన్ని, మందుల విభాగాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో మందులన్నీ అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం గన్నవరం, పెదఅవుటపల్లి, ఆత్కూరు ఆసుపత్రుల్లోని వైద్యులు, సిబ్బందితో గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సమీక్షించారు. డ్రైనేజీ, దోమల సమస్యనూ అడిగి తెలుసుకున్నారు. ముస్తా బాద పిహెచ్ సి పరిధిలో సాధారణ జ్వరాలతో తీవ్రంగా బాధపడు తున్న వారిని గుర్తించామని, ఆత్కూరు పిహెచ్ సి పరిధిలోనూ, పెద్ద అవుటపల్లి పీహెచ్ సి పరిధిలోనూ సాధారణ ద్వారా రోగులను గుర్తించి వారికి వైద్య సేవలు అందిస్తున్నట్లు సంబంధిత డాక్టర్లు రామారావు దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయం చేసుకొని గ్రామాల్లో పారిశుధ్య నియంత్రణ, దోమల నిర్మూలనకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.


గన్నవరం ఆస్పత్రిలో రక్త పరీక్షల కేంద్రంలో రిపోర్టులు పరిశీలిస్తున్న రామారావు

తెంపల్లిలో పారిశుద్ధ్య పనులు

గన్నవరం మండలం తెంపల్లి పంచాయతీలో పారిశుధ్య నియంత్రణ పనులు సోమవారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్, సర్పంచ్ శిరీష ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న డ్రైనేజీల్లో సున్నం చల్లించారు. మురుగునీరు నిలవకుండా కాలవలను శుభ్రం చేశారు. ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. గ్రామంలో దోమల వల్ల విష జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు నివారణ చర్యలు చేపట్టామని కార్యదర్శి చెప్పారు.



రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంకిపాడు : సామాన్య ప్రజానీకానికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వైద్యులకు సూచించారు. సోమవారం కలెక్టర్ పెనమలూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ నిల్వగది, మందుల విభాగాన్ని, సేఫ్ డెలివరీ క్యాలెండరు చార్టును పరిశీలించి డాక్టర్లతో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రానికి రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారని, కాన్పులు ఎన్ని జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ప్రశ్నించగా వైద్యులు సాయి లలిత, రాజా సమాధానం చెబుతూ రోజుకు 100 నుండి 150 మంది దాకా రోగులు వస్తున్నారని, నెలకు ఒక కాన్పు జరుగుతుందని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పెనమలూరు మండలం తాడిగడప లోని రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యూరియా సరఫరా, పంపిణీ రికార్డులను పరిశీలించారు. ఐఎఫ్ఎస్ లో ఎప్పటికప్పుడు యూరియా పంపిణీ, తాజా వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఇన్చార్జి డిఎం డిఎంహెచ్వో డాక్టర్ అంబటి వెంకటరావు, ఎన్టీఆర్ ఆరోగ్య ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ కుమార్, పెనమలూరు తహసిల్దారు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలని నిరసన



ప్రజాశక్తి-బంటుమిల్లి : కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురం, కృత్తివెన్ను సెంటర్లో నిరసన నిర్వహించి కరపత్రాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని, ఆక్వారంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించి భీమా పథకాన్ని వర్తింపజేయాలని, శీతల గిడ్డంగులు ప్రతి మండలంలోను ఏర్పాటు చేయాలని, విద్యుత్తో రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11 వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర ఆక్వా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ శ్రీ వులగం సుబ్రహ్మణం, రైతు సంఘం సీనియర్ నాయకులు, ఆక్వా రైతు పు ప్పాల నరసింహారావు, రామకోటి, రాజు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో విద్యార్థిని మృతి...?



ప్రజాశక్తి-పామర్రు : మండలం లోని పెదమద్దాలి గ్రామంలో అనారోగ్యంతో ఎనిమిదో తరగతి చదువుతున్న చిన్నారి గుమ్మడి లావణ్య(12) అకస్మికంగా మృతి చెందింది. గుమ్మడి నిర్మలరావు కుమార్తె లావణ్య జ్వరంతో బాధపడుతుండగా ఈనెల 5న పామర్రు లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ రక్త పరీక్షలు నిర్వహించిన అనంతరం అత్యవసర సేవల నిమిత్తం విజయవాడ లోని ప్రైవేట్ హాస్పటల్కు తరలించారు.వైద్య సేవలు పొందుతూ లావణ్య ఆదివారం మృతి చెందింది. కార్డియాక్ అరెస్టుతో బాలిక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా బాలిక డెంగ్యూతో మృతి చెందిందని గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది.

స్వీటు దుకాణం దగ్ధం



ప్రజాశక్తి పామర్రు : స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద చల్లపల్లి రోడ్లోని తాడిశెట్టి నాగేశ్వ ౦రావు స్వీట్ షాపు అగ్నికి ఆహుతి అయ్యింది. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో స్వీట్ షాపులో అగ్ని మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న స్థానిక అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి యన్.రాంబాబు తెలిపారు. ఈ ప్రమాదంలో దాదాపు 5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-ఘంటసాల : బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని ఘంటసాల గ్రామ సర్పంచ్ బాణావత్ వెంకటేశ్వరమ్మ తెలిపారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఘంటసాల గ్రామ సచివాలయం వద్ద బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయటం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. వాసవ్య మహిళా మండలి కో-ఆర్డినేటర్ సిహెచ్.ఉషారాణి మాట్లాడుతూ చిన్న వయస్సులో బాల్య వివాహాల చేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉంద న్నారు. మండల విద్యాశాఖాధికారి- 2 మోమిన్, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, కృష్ణా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత


ప్రజాశక్తి -మచిలీపట్నంఅర్బన్ : పెడనలోని బ్రహ్మపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి మచిలీపట్నం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక చేయూత అందించారు. 22వ వార్డు పెడన బ్రహ్మ పురం చెందిన తాడిశెట్టి సత్యనారా యణకు చెందిన నివాసగృహం, బడ్డీకొట్టు గ్యాస్ బండ లీకేజీ తో పూర్తిగా అగ్నికి ఆహుతి కాగా, మూడు లక్షల పైగా ఆస్తినష్టం జరిగిన పరిస్థితుల్లో న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, బియ్యం , బట్టలు, 3000 రూపాయలు నగదును అందజేశారు. మాదిరెడ్డి అంజిబాబు, మల్లంపల్లి వీర వెంకట రామాంజనేయులు బాబు పాల్గొన్నారు.

ఎరువులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం : ప్రైవేట్ షాపుల్లో ఎరువుల వ్యాపారం సక్రమంగా చేయాలని విజిలెన్స్ డిఎస్పి యు. బంగార్రాజు అన్నారు.. సోమవారం కేసరపల్లి రైతు భరోసా కేంద్రంలో ఎరువుల పంపిణీని ఆయన పరిశీలించారు. బంగార్రాజు రైతులతో మాట్లాడుతూ షాపులో కొనుగోలు చేసిన ప్రతి ఎరువుకి బిల్లు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు కొనుగోలు చేయాలని, అంతకంటే ఎక్కువ ధర చెల్లించకూడదని చెప్పారు. యూరియా కొరత ఉందని రైతుల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొద్ది రోజుల్లో పూర్తిగా యూరియా అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు.

బస్సులు ఆపకపోవటంతో విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఉచిత బస్సు పుణ్యమా అంటూ... ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు అగచాట్లు తప్పటం లేదు. బస్పాస్లు కొనుగోలు చేసిన విద్యార్థు లకు అయితే ఆర్టీసీ బస్సులు ఆపకుండా సినిమా చూపెడుతున్నారు. గుడ్లవల్లేరు విద్యా సంస్థలకు నిలయం. ఈ కాలేజీల విద్యార్థులు వేలాది మంది జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, హనుమాన్ జంక్షన్, పెడన, ముదినేపల్లి, కైకలూరు తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులకు వస్తుంటారు. ఉదయం గడిచిందిలే అనుకుంటే....సాయంత్రం కాలేజీల నుంచి వెళ్లేటపుడు ఈ విద్యార్థులకు నరకప్రాయమే. అప్పటి వరకు చదివి అలసి...సొలసిపోయి ఇంటి ముఖం పట్టే సమయంలో విద్యార్థులను ఆర్టీసీ బస్సులు డ్రైవర్లు బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారు. 20 నిమిషాలకు ఒక బస్సు వచ్చినా...బస్ పాస్లు ఉండే విద్యార్థులను చూసి ఆపకుండా వెళ్లిపోతున్నారు. దీనితో రాత్రి అయినా గంటల తరబడి నిలువు కాళ్ల మీద విద్యార్థులు పడిగాపులు పడుతున్నారు. ఉదయానే మళ్లీ కాలేజీకి రావాలంటే...త్వరగా ఇంటికి వెళ్లాల్సిందే. కాని బస్సులు ఆపక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఏదో ఒక బస్సును డ్రైవర్ ఆపినా...ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో బస్సులో అంతమంది పట్టడం లేదు. మళ్లీ కొంతమంది అదే బస్టాప్లో ఆగిపోవటంతో నిరాశే ఎదురవుతుంది.



కొంత మందికే యూరియా

• నిరాశతో వెనుదిరుగుతున్న రైతులు • పంట దిగుబడిపై ఆందోళన

యూరియా కొరతలేదని మంత్రులు, అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులకు యూరియా అందక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు పడటం, సాగర్ నీళ్లు కాలువలకు వదలడం, చెరువులు నిండుకుండలా ఉండటంతో రైతులు సకాలంలో వ్యవసాయం మొదలుపెట్టారు. వరి వేసి రెండు నెలలు అయినప్పటికీ ఇంతవరకు సకాలంలో రైతులకు యూరియా పూర్తిస్థాయిలో అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. రైతులు, కౌలు రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేసి యూరియా కోసం సొసైటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రైవేటు షాపులు వద్దకు వెళితే ఆయా షాపులు వారు యూరియా తీసుకోవాలంటే దానికి ప్రత్యామ్నాయంగా నానో యూరియా కానీ, గడ్డి మందు గానీ, గుళికలు కానీ, డీఏపీ కానీ తీసుకోవాలని అలా తీసుకుంటేనే యూరియా ఇవ్వటం జరుగుతుందని నిబంధన పెట్టి మరీ రైతులకు అవసరం లేకపోయినా మిగిలినవి అంటగడుతున్నారు. డిఏపి 1400 రూపాయలు రెండు యూరియా కట్టలు 600 మొత్తం రూ.2 వేలు వెచ్చించాల్సి వస్తుంది.



ప్రజాశక్తి-గంపలగూడెం: యూరియా ఇస్తామని పిలుస్తారు... పోతే ఇచ్చేది కొందరికేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంపలగూడెంలో యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో పత్తి, 11,500 ఎకరాల్లో వరి, 4800 ఎకరాల్లో ఇతర పంటలు రైతులు సాగు చేశారు. ఆదివారం కనుమూరు సొసైటీలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఎంతో ఆశతో వెళ్లి సొసైటీ ముందు నిలబడితే కొందరికి (ఒక్కో పాస్ పుస్తకానికి) ఒక్క కట్ట మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అనుములంక, కనుమూరు గ్రామాల పరిధిలో సొసైటీలో 1,550 మంది సభ్యత్వం కలిగిన రైతులు ఉండగా దాదాపు ఏడు వేల ఎకరాల సాగు భూమి ఉంది. సొసైటీకి యూరియా (35 టన్నులు) 775 కట్టలు రాగా ఒక్కో కట్ట చొప్పున సగం మందికి మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు రెండు, మూడు రోజుల్లో ఇస్తామని అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు. వరి పంటకు మూడు దఫాలుగా కాంప్లెక్స్ ఎరువులతో పాటు యూరియాను తప్పనిసరిగా వాడాలని, మూడు దఫాలు యూరియా పంటకు అందించకపోతే దిగుబడి రాదని రైతులు చెబుతున్నారు.



చిన్న రైతులు చితికిపోయారు

వేల్పుల వెంకటేశ్వర్లు, తూర్పు దళితవాడ

నాకు చదువు రాదు. నాకున్నది 1.50 ఎకరాల భూమి. దానికి తోడు మరో రెండు ఎకరాలు కౌలు భూమిని సాగుచేస్తున్నా. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఎరువులు కొరత సృష్టించి చిన్న రైతులు చితికిపోయేలా చేస్తున్నారు. ఎవరికి చెప్పిరా పట్టించుకునే వారు లేరు.



పంట చేతికి రాదు

కోట వెంకట రామారావు, గంపలగూడెం

ఎరువులు ఇక్కడే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా. ఎప్పటినుండో మా తాత, తండ్రుల నుండి ఈ సొసైటీలోనే ఎరువులు, విత్తనాలు, రుణాలు పొందుతున్నాం. నేడు యూరియా కొరత పేరుతో ఎరువులు ఇవ్వలమంటున్నారు. ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఈ వారంలో యూరియా అందకపోతే పంట చేతికి రాదు.



ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు

వల్లభనేని హరీష్, ఎఒ

మండలానికి యూరియా పూర్తిస్థాయిలో వచ్చింది. త్రితి ఎకరాకు అవసరమైన స్థాయిలో ఇచ్చే చర్యలు చేపడుతున్నాం. ఈ ఏడాది ఇప్పటికే 2,164 టన్నుల యూరియాను పంపిణీ చేశాం. గతేడాదికంటే 329 టన్నులు అదనంగా ఇచ్చామని తెలిపారు. సోమవారం గొల్లపూడి 15, ఆర్లపాడు 10, కొనిజర్ల 25, పేనుకొలను 10, గంపలగూడెం గ్రోమోర్ 30 వెరసి 80 టన్నులు అందజేశాం.



పూర్తిస్థాయిలో అందించాలి

ఎపి రైతు సంఘం అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి

అధికారులు ఇప్పటివరకు ఆయా సొసైటీల్లో నామమాత్రంగా ఒకటి, రెండు కట్టలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కనుమూరులో సగం మంది రైతులకు ఒక్కొక్క కట్ట ఇచ్చి పంపించారు. గంపలగూడెం పిఎసిఎస్‌లో కేవలం ఎకరాకు అర కట్ట మాత్రమే ఇచ్చి సరిపెట్టారు. ఈ వారం రోజుల్లో యూరియా అందించకపోతే పంట చేతికొచ్చే పరిస్థితులు ఉండవు. రైతాంగానికి పూర్తిస్థాయిలో యూరియా అందించాలి.

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సుమారు 10 వేల ఎకరాల్లో సాగు చేశారు. పత్తి 600 ఎకరాలు, మిర్చి 2500 ఎకరాలు, మొక్కజొన్న 300 ఎకరాలు, కూరగాయ పంటలు సైతం ప్రస్తుతం సాగు చేశారు. యూరియా రెండు వేల టన్నులు అవసరమై ఉండగా ప్రస్తుతం 1400 టన్నులు వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మండలంలో మొత్తం ఆరు సొసైటీలతో పాటు మరో 14 ఫెర్టిలైజర్స్ షాపుల ద్వారా యూరియాను రైతులకు అందిస్తున్నట్లు చెప్తున్నారు. వరి వేసి 40 రోజులు అవుతున్నప్పటికీ ఇంతవరకు యూరియా పూర్తిస్థాయిలో వేయకపోవడంతో వరి దుబ్బు కట్టిన దాఖలాలు లేవు.



నిరాశే ఎదురవుతుంది : దొంతిబోయిన శ్రీనివాసరావు

యూరియా కోసం సొసైటీల వద్దకు తిరిగినా ఒక్క కట్ట కూడా ఇవ్వకపోవడంతో నిరాశే ఎదురవుతుంది. మూడు ఎకరాలు వరి సాగు చేస్తున్నా. ఇప్పటికి రెండు కట్టలు మాత్రమే ఇచ్చారు. బయట షాపులకు యూరియా కావాలని వెళితే ఒత్తిడి చేసి మరీ ఏదో ఒకటి అంటగడుతున్నారు.



12 ఎకరాలు కౌలుకు తీసుకున్నా : సిమ్మినేని సాయి, కౌలు రైతు

12 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నా. కౌలుకు తీసుకొని లక్షలాది రూపాయలు అప్పు చేసి మరి వరి పంట సాగు చేస్తున్నా.ఇంతవరకు 2 యూరియా కట్టలు మాత్రమే జగ్గయ్యపేట గోపాలకృష్ణ సొసైటీలో ఇచ్చారు. నాట్లు వేసి 40 రోజులు అవుతున్న ఇంతవరకు పూర్తిస్థాయిలో పంటకు యూరియా వేసిన దాఖలాలు లేవు. ఇటువంటి సమయంలో పంట ఏమి పండుతుంది. గత 20 రోజులుగా యూరియా కోసం సొసైటీల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు.




కొరత లేకుండా చూడాలి : కాకనబోయిన లింగారావు, రైతు సంఘం నాయకులు

యూరియా కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. యూరియా కొరత లేనప్పుడు రైతులు అడిగినంత యూరియా ఎందుకు ఇవ్వటం లేదు. యూరియా కావాలని పెర్టిలైజర్ షాపులకు వెళితే ఆ షాప్ యజమానులు వారికి ఇష్టం వచ్చినంత ధరకు అమ్ముకోవడం అంతేకాకుండా యూరియా కావాలంటే నానో యూరియా, నానో డిఏపి, 20:20 డిఏపి కట్టలు కొనాలని ఒత్తిడి చేయడం జరుగుతుంది. దీనిపై ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు షాపులపై పర్యవేక్షణ లేకపోవడమే కారణం. సొసైటీల ద్వారా కావలసినంత యూరియా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలి.



యూరియా కొరత లేదు : వరలక్ష్మి, వ్యవసాయ అధికారి

మండలంలో యూరియా కొరత లేదు. రెండు వేల టన్నులు యూరియా అవసరం కాగా ఇప్పటివరకు రైతులకు 1400 టన్నుల యూరియా ఇవ్వటం జరిగింది. ప్రస్తుతం 150 టన్నుల యూరియా స్టాక్ ఉంది. మండలానికి మరో 300 టన్నులు యూరియా రెండు మూడు రోజుల్లో వస్తుంది. రైతులు ఒక ఎకరం వరికి రెండు కట్టలు మాత్రమే యూరియా వాడాలి. మండలంలోని గ్రామాలలో రైతుల ఇళ్లకు వెళ్లి యూరియాపై సర్వే చేస్తున్నాం. ప్రతి ఒక్క రైతు ఇంటిలో 1, 2 యూరియా కట్టలు ఉన్నాయి. యూరియా అధికంగా వాడితే పంటకు నష్టం కలుగుతుంది.



పారదర్శకంగా ఎరువుల సరఫరా : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, అత్యంత పారదర్శకంగా, ప్రణాళిక ప్రకారం అన్నదాతలకు అండగా నిలబడుతూ అవసరానికి తగ్గట్లు ఎరువులు సరఫరా చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ తమ సమీపంలోని సొసైటీలో అందుబాటులో ఉన్న ఎరువులు, వచ్చే వారం రోజుల్లో కొత్తగా వచ్చే ఎరువులు, పంట దశను బట్టి ఎరువుల మోతాదు తదితర అంశాలతో పాటు నానో యూరియా ప్రయోజనాలను కూడా ఇంటింటికీ వెళ్లి అధికారులు, సిబ్బంది వివరించినట్లు తెలిపారు. గతేడాది ఖరీఫ్‌తో పోల్చితే ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం పెరిగిందని, దీనికి తగ్గట్లు యూరియాకు కూడా డిమాండ్ పెరిగిందని, ఇటీవల వర్షాలు కూడా బాగా పడటం వల్ల ఒక్కసారిగా డిమాండ్ అధికమైందని వివరించారు. అయినా ఎక్కడా ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తోందని, ఆ సమాచారాన్ని రైతులకు అందిస్తూ పంపిణీ పరంగా సమస్యలు లేకుండా చూస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో వివిధ శాఖల అధికారులతో కూడిన బృందాలు కూడా రైతులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.



యుటిఎఫ్ 'రణభేరి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై ఈ నెల 15 నుండి 19 వరకు జరిగే యుటిఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయవాడ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రణభేరి పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడిచినా ఉద్యోగుల ఆర్థికపరమైన ఏ ఒక్క సమస్య పరిష్కారానికి చర్యలు చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు డిఏలు పెండింగ్లో ఉన్నాయని, పిఆర్సి కమిషనర్‌ని నియమించలేదని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య మాట్లాడుతూ 2021 నుండి పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు, రిటైర్ అయిన ఉద్యోగుల గ్రాట్యూటీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్ పని భారం, విద్యాశక్తి కార్యక్రమాలు, ఆన్లైన్ పనులు, పరీక్ష మూల్యాంకనం, గ్రీన్ పాస్ స్పోర్ట్ మొదలైన బోధనేతర పనులు ఉపాధ్యాయులపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, తద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధనకు ఆటంకంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యులు జే.రామకృష్ణ, పి.రామారావు, బి.జానకి, రూరల్ మండలం అధ్యక్షులు దేవ్, బి.రమేష్ పాల్గొన్నారు..

మహిళలకు రక్షణ కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి-వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలో ఐద్వా మండల మహాసభ షేక్ జాన్బీ అధ్యక్షతన జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ మహిళలపై పని ప్రదేశాల్లో జరుగుతున్న వేధింపులు నిర్మూలించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు బెదిరింపులు వాటిపై కఠినమైన చట్టాలు తీసుకుని మహిళలకు రక్షణ కల్పించాలని, గ్రామాల్లో ఉన్న మద్యం షాపులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా జాన్బి, చాంద్ బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

15 నాటికి దసరా ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : దసరా ఉత్సవ ఏర్పాట్లను దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సోమవారం పరిశీలించి సమీక్ష నిర్వహించారు. కనకదుర్గా నగర్ ప్రారంభం నుండి కాలినడకన ప్రసాదం పోటు, అన్నదానం భవనాలు తదితర పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాబోయే పది రోజులు చాలా కీలకంగా భావించి, దసరా ఏర్పాట్లు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సాంకేతికత వినియోగించి సందర్శకులకు మరిన్ని సేవలు అందించే సంకల్పంతో ఉన్నామన్నారు. ఉత్సవ ఏర్పాట్లు ఈ నెల 15 నాటికి కచ్చితంగా పూర్తి అయ్యేలా చూస్తున్నామన్నారు.



మహిళా చట్టాల అమల్లో విఫలం : ఐద్వా

విజయవాడ: ఐద్వా 15వ డివిజన్ మహాసభ రామలింగేశ్వర్ నగర్ శీలం కోటిలింగం స్మారక గ్రంథాలయంలో సోమవారం జరిగింది. 11మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. 15వ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులుగా కె.తులసి, టి.రాణి సహాయ కార్యదర్శులుగా రిబ్కా, మల్లీశ్వరి, తిరుపతమ్మ ఎన్నికయ్యారు. ఐద్వా జెండాను తూర్పు సిటీ మహిళా నాయకురాలు మాతంగి రత్నమాల ఎగురవేశారు. ఐద్వా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు కె.సరోజ మాట్లాడుతూ మహిళా చట్టాల అమల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యన్.నాగేశ్వరరావు, కాయల కుమారి, టి.శాంతి, షేక్.ఆశా, పద్మిని, జి.కె. ప్రసాద్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



యూరియా కోసం పరుగులు

- గోదాముల వద్ద ఉదయం నుంచే బారులు తీరుతున్న రైతులు
- పలుచోట్ల అరబస్తా పంపిణీపై ఆవేదన



గన్నవరం మండలం బిబిగూడెంలో బారులు తీరిన రైతులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలో యూరియా కోసం అన్నదాతలు పడుతున్న కష్టాలు అన్ని ఇన్ని కావు. సోమవారం బీబీ గూడెం, ముస్తాబాద, సూరంపల్లి సహకార సంఘం గోదాముల వద్ద పడిగాపులు కాసినా యూరియా దొరకక చాలా మంది రైతులు వెనుదిరిగి వెళ్లారు. తెల్లారింది మొదలు ఉదయం 4 గంటల నుంచే యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. రైతులు వ్యవసాయ పనులన్నీ వదులుకొని కుటుంబ సమేతంగా వచ్చి క్యూ లైన్లో ఉండి యూరియా కోసం నిలుచున్నారు. బీబీగూడెం సొసైటీ పరిధిలో చిక్కవరం, గొల్లనపల్లి, బీబీ గూడెం గ్రామాలు వున్నాయి. ఈ గ్రామాల్లో 3150 ఎకరాల్లో పంటలు వేస్తున్నారు. 2500 ఎకరాల్లో వరి వేస్తారు. సొసైటీకి రెండుసార్లుగా 860 యూరియా కట్టలు వచ్చాయి. సోమవారం 430 కట్టలు దిగుమతి అవ్వడంతో పంపిణీకి శ్రీకారం చుట్టారు. విషయం తెలుసుకున్న రైతులు వందల సంఖ్యలో సొసైటీ వద్దకు రావడంతో అలజడి చోటుచేసుకుంది. పోలీసులు రంగంలోకి దిగి అందరినీ సర్దుబాటు చేశారు. మొదటి విడతగా 2000 బస్తాలు అవసరం కాగా 860 బస్తాలు మాత్రమే రైతులుకు అందాయి. అదేవిధంగా ముస్తాబాద్ సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు వందల సంఖ్యలో ఎగబడ్డారు. 450 బస్తాలు రాగా ఒక్కో రైతుకు ఒక్కొక్క కట్ట చొప్పున ఇచ్చారు. ఈ సొసైటీ పరిధిలో ఐదు వేల ఎకరాల దాకా వరి సాగు అవుతుంది. రెండుసార్లుగా 900 బ్యాగులను రైతులకు ఇచ్చారు. ఇంకా 3 వేల కట్టలు అవసరమని, అవి ఎప్పటికి వస్తాయో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూరంపల్లి సొసైటీకి 450 కట్టలు రాగా, టోకెన్లు ఇచ్చి ఒక్కో రైతుకు ఒక్కో కట్ట పంపిణీ చేశారు. చాలామంది రైతులు ఒక కట్ట కూడా అందకపోవడంతో నిరాశగా వెను తిరగాల్సి వచ్చింది. వ్యవసాయ మండల అధికారి శివప్రసాద్ పరిశీలనలో యూరియా పంపిణీ సాగుతోంది.

ఒక్క కట్ట పంపిణీపై అభ్యంతరం

ప్రజాశక్తి-పామర్రు : మండల పరిధి కురుమద్దాలి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం రైతులకు యూరియాను అందించారు. యూరియా ఇస్తున్నారనే సమాచారంతో అధిక సంఖ్యలో రైతులు సంఘం కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఒక్కొక్కరికి ఒక కట్ట చొప్పున యూరియా ఇవ్వటంపై రైతులు అభ్యంతరం తెలిపారు. చాలీచాలని ఎరువులతో తాము వ్యవసాయం ఎలా చేయ్యాలని అధికారులను ప్రశ్నించారు. ఈ ఏడాది వ్యవసాయం అందిరావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి శివ నాగరాణి మాట్లాడుతూ కురుమద్దాలిలో 15 టన్నులు ఏరియా వచ్చిందని, దాన్ని అందరికీ అందేటట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మండల పరిధి అడ్డాడలో 10 టన్నులు, ఉంద్రపూడిలో 15 టన్నులు, పసుమర్రులో15 టన్నులు,ఎలకుర్రులో10 టన్నులు చొప్పున యూరియా దిగుమతి అయిందని ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా అందిస్తునట్లు ఆమె తెలిపారు.

యూరియా అందిరికీ అందిస్తాం

తేలప్రోలు పిఎసిఎస్ చైర్మన్ ఆరుమళ్ళ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-ఉంగుటూరు : రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను అందిస్తామని ఎవరు ఆందోళన చెందొద్దని తేలప్రోలు పిఎసిఎస్ చైర్మన్ ఆరుమళ్ళ వెంకట కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తేలప్రోలు పిఎసిఎస్‌లో సోమవారం పాలక వర్గం, సిబ్బంది ఆద్వర్యం లో రైతులకు పాస్ బుక్ ఆధారంగా యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట క్రష్ణారెడ్డి మాట్లాడుతూ పిఎసిఎస్ ద్వారా ఇప్పటివరకు 15 టన్నుల యూరియాను వివక్షత లేకుండా అందరికి భూమి ఆధారంగా సమానంగా పంపిణీ చేశామన్నారు.

యూరియా పంపిణీలో గందరగోళం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని కొత్తపల్లి పిఎసిఎస్ వద్ద యూరియా పంపిణీ గందరగోళంగా నడుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. పలువురు రైతులు తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల క్రితం కొత్తపల్లి పిఎసిఎస్‌కి యూరియా స్టాక్ రావడంతో రైతులు ఎగబడకుండా టోకెన్ విధానంలో పంపిణీ చేశారు. స్టాక్ మొత్తం పంపిణీ చేయగా సుమారు 40 మంది రైతులు మిగిలిపోయారు. వారికి తరవాత లోడ్ రాగానే పంపిణీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం సోమవారం 225 బస్తాల లోడు కొత్తపల్లి పిఎస్ఎస్‌కు రావడంతో గతంలో మిగిలిన రైతులకు మొదటి ప్రాధాన్యత క్రమంలో పంపిణీ చేయకుండా అందర్నీ కలిపి పంపిణీ చేయడంతో గతంలో యూరియా అందని రైతులు నష్టపోయారు. కొంతమంది రైతులకు సోమవారం వచ్చిన లోడ్‌లో కూడా ఒక బస్తా కూడా అందకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు. ఒక ఎకరాకు అరవస్తా చొప్పున పంపిణీ చేస్తామని చెప్తున్నా అధికారులు ఏ ప్రాధాన్యత క్రమంలో పంపిణీ చేస్తున్నారో ఎవరికీ అర్థంకాక గందర గోల పరిస్థితిలో ఆవేదన చెందుతున్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : మండల పరిధిలోని పురిటిగడ్డ ప్రాథమికవ్యవసాయ పరపతి సంఘంకు 15 టన్నుల యూరియా నెలరోజులు తర్వాత రావటంతో రైతులు ఒక్కసారిగా సొసైటీ వద్దకు చేరుకున్నారు. నెలరోజులు ఉండి యూరియా కోసం ఎదురు చూస్తూ ఉంటే తీరా వచ్చాక ఎకరానికి అర బస్తా ఇవ్వడంపై రైతులు ప్రశ్నించారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, అందరికీ పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ అధికారి మురళీకష్ణ అన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మొవ్వ మండల వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో సోమవారం 75 టన్నుల యూరియా పంపిణీ ప్రైవేట్ దుకాణాలలో ప్రశాంతంగా జరిగింది. కోసూరులో 15 టన్నులు, కూచిపూడిలోని మూడు దుకాణాలలో 35 టన్నులు, నిడుమోలులో 21 టన్నుల యూరియాని ఏవో బి సురేష్ బాబు నాయక్ పర్యవేక్షణలో, ఆయా ప్రాంతాల గ్రామ వ్యవసాయ సహాయకుల సహకారంతో విక్రయాలు నిర్వహించారు



ఉంగుటూరు మండలం తేలప్రోలులో యూరియా పంపిణీ



పామర్రు మండలంలో బారులుతీరిన రైతులు



మొవ్వ మండలంలో యూరియా కోసం అవస్థలు

కెవి విద్యార్థినికి మెడికల్ సీటు



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థిని కుంపటి అక్షయ మౌళి నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి ఎంబిబిఎస్ లో సీటు సొంతం చేసుకోవడం విద్యాల యాకు గర్వకారణం అని ప్రిన్సిపల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్షయ మౌళిను విద్యాలయాలో సోమవారం సత్కరించి జ్ఞాపికను అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల క్రమశిక్షణ ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని అన్నారు. అక్షయమౌళి ప్రసిద్ధి గాంచిన సిద్దార్థ వైద్య కళాశాల లో ఎంబిబిఎస్ సీటు సాదించడం అభినందనీయం అన్నారు. అక్షయ మౌళి సీటు సాధన లో తన అనుభవాలను పంచుకున్నారు.

రేపటి నుంచి అండర్-14,17 జట్ల ఎంపిక

ప్రజాశక్తి-గూడూరు : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2025-26 విద్యాసంవత్సరానికి ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించిన టోర్నమెంట్ కం సెలక్షన్స్ ఈనెల 10వ తారీఖు నుండి 19వ తారీకు వరకు జరుగుతాయనికష్ణాజిల్లా బాలుర మరియు బాలికల కార్యదర్శులు మత్తి అరుణ మరియు గంపా రాంబాబు ఒక ప్రకటన తెలిపారు. 10 వ తేదీన జూడో అండ్ సెపక్ తక్ర అండర్ 14,17 (బాలుర, బాలికల) విభాగంలో టోర్నమెంట్ కం సెలక్షన్స్ విజయవాడ పటమట బాయ్స్ హై స్కూల్‌లో జరుగుతాయన్నారు.


పిఎసిఎస్‌లపై మరింత నమ్మకాన్ని పెంచాలి

- కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : రైతులకు, గ్రామస్థులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలపై ఆయా సంఘాల అధ్యక్షులు మరింత నమ్మకాన్ని పెంపొందించాలని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం సూచించారు. మచిలీపట్నం కేడీసీసీ ప్రధాన కార్యాలయంలో సోమ వారం పెడన, అవనిగడ్డ , మచిలీపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ మన మీద నమ్మకంతో రైతులు పెట్టుబడులు పెడుతున్నారని, ప్రతి రూపాయి డిపాజిట్‌కి పిఏసిఎస్ లు సంపూర్ణ భద్రత కల్పిస్తుందని స్పష్టంగా తెలియజేయాలన్నారు. అదే విధంగా పిఏసిఎస్‌లు అందిస్తున్న వడ్డీ రేట్లు రైతులకు, డిపాజిటర్లకు లాభదాయకంగా ఉండేలా నిర్ణయించామని, భవిష్యత్తులో కూడా వడ్డీ చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బ్యాంక్ సిఈఓ ఏ.శ్యామ్ మనోహర్‌పాల్గొన్నారు.

హాస్టల్‌కు మైక్ సెట్ బహూకరణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలోత్సవం పిల్లల సొసైటీ ఆధ్వర్యంలో ఒక పోర్టబుల్ మైక్ సెట్ ను సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ వార్డెన్ మువ్వల ప్రకాష్‌కు సోమవారం అందజేశారు. అదేవిధంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వెల్ది పాడు హై స్కూల్ హెచ్ఎం డాక్టర్ టి సీతారాం, రంగన్నగూడెం స్కూల్ మాస్టర్ బండపల్లి నాగరాజును ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, గన్నవరం బాలోత్సవం పిల్లల సొసైటీ అధ్యక్షుడు గన్నే వెంకట్రావు, పుణ్య చారిటీస్ సెక్రటరీ జాస్తి , విజయభూషణ కుమార్ గ్రంథాలయ అభివద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు మానవతా చైర్మన్ మడుపల్లి బాలకష్ణమూర్తి మానవతా సెక్రటరీ వివి కష్ణమోహన్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ ప్రముఖ అడ్వకేట్ అనుమోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మైక్ సెట్ అందిస్తున్న బొడ్డు నాగేశ్వరరావు

యూరియా వస్తోంది... ఆందోళన వద్దు.. : కలెక్టర్

ప్రజాశక్తి-గన్నవరం : జిల్లాలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, నిరంతరం సరఫరా జరుగుతుందని రైతులు ఏమాత్రం ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులతో అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ గన్నవరం నియోజకవర్గంలోని బాహుబలేంద్రుని గూడెం, చిక్కవరం గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. కలెక్టర్ ఎక్కడికక్కడ రైతులతో ముఖాముఖి మాట్లాడి యూరియా స్థితిగతులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యూరియా నిరంతరం కొనసాగుతుందని ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని వారికి వివరించారు. ఇంకా యూరియా లోడ్లు వస్తున్నాయని, సరఫరా నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గన్నవరం తహసిల్దార్ వెంకట శివయ్య, ఏడిఏ సునీల్, ఏవో శివప్రసాద్ పాల్గొనారు.



శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఎలుకపాడు గ్రామంలో శ్మశానం అభివద్ధికి నిధులు కేటాయించాలి అని సిపిఎం మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని ఎలుక పాడు గ్రామంలో శ్మశానం అభివృద్ధి చేయాలని సిపిఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్పందనలో మండల పరిషత్ ఏఓ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా గ్రామంలో శ్మశానం అభివృద్ధికి నోచుకోలేదని, గ్రామంలో అత్యదిక మంది ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన వారు ఎవరైనా చనిపోతే రెండు కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్ళాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాకోబు, ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

జగన్ స్ఫూర్తితో సామాజిక సేవ



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మో హన్‌రెడ్డి స్ఫూర్తితో సామాజిక సేవలను చేయను న్నామని తీట్ల లలితమ్మ ఫౌండేషన్ అధినేత, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తీట్ల వీరయ్య అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని డాక్టర్ వీరయ్య, తీట్ల రాజాసందీప్ కలసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. సమాజంలో పేద, అణగారిన, వెనుకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడి సంక్షేమ ఫలాలను అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని వీరయ్య కొనియాడారు.

ఆట వస్తువులు అందజేత

ప్రజాశక్తి-పామర్రు : వికలాంగుల్లో మానసిక స్థైర్యాన్ని నెలకొల్పటానికి సేవా సంస్థలు ముందుకు రావటం అభినంద నీయమని ప్రముఖ ఫిజోదెరపి వైద్యులు డా.కె. శ్యాం ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ దివ్యాంగుల భవిత పాఠశా లలో పామర్రు మానవత సేవ సంస్థ వారు ప్రపంచ ఫిజియో దెరపి దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మానవత సంస్థ అధ్యక్షులు ఎన్. త్రివిక్రమరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మేన కోడలు ఎన్. అమూల్య పుట్టినరోజు సంద ర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు ఆట వస్తువులు, పుస్తకాలు పంపిణి చేశారు.

పిబి సిద్ధార్థలో అణు విజ్ఞాన ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

అంతరిక్షం, రక్షణరంగాల్లో అప్రతిహతంగా దూసుకుపోతున్న భారతదేశం నుంచి శిక్షణ తీసుకోవడానికి పలు దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయ కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ అన్నారు. విజయవాడ పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం రాష్ట్రంలోనే మొదటిసారిగా అణువిజ్ఞానంపై నిర్వహిస్తున్న ఐదు రోజుల సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల ద్వారా ఏనాడో భారతదేశం తన వైజ్ఞానిక ప్రతిభను చాటుకుందన్నారు. సామాజిక ప్రయోజనానికి విద్యావ్యవస్థ మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, శని,



మాట్లాడుతున్న కృష్ణా వర్సిటీ ఉపకులపతి రాంజీ

ఆదివారాల్లో గ్రామీణ ప్రాంతాలకి విద్యార్థులు, అధ్యాపకులు తరలివెళ్లి సేవలతో గ్రామాల ముఖచిత్రాన్ని మార్చాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ ఆహారం, వైద్యం తదితర రంగాల్లో విజ్ఞానశాస్త్రం అనేక మార్పులు తెచ్చిందన్నారు. కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్ మాట్లాడుతూ 30 వేల మంది విద్యార్థులతో 5 వేల మంది బోధన, బోధనేతర సిబ్బందితో అలరారుతున్న సిద్ధార్థ కళాశాల స్వర్ణోత్సవ సంవత్సర కార్యక్రమంగా ఈ సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాస కృష్ణ, ప్రజా సమన్వయ విభాగం హెడ్ జలజా మదనమోహన్, సైంటిఫిక్ ఆఫీసర్ కె. పార్థిపన్, అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల, డిప్యూటీ హెడ్ డా.ఎం.తస్నీమ్, సహాయాచార్యులు జె.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-మైలవరం: మండలంలోని పుల్లూరు సెంటర్లో ఉన్న సిపిఎం స్థూపం వద్ద సిపిఎం అగ్రనేత సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ మాట్లాడుతూ నేటి తరం సీతారాం ఏచూరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావూరి రమేష్‌బాబు, రావుల సుబ్బారావు, సిపిఎం నాయకులు లంక వెంకటేశ్వరరావు, సిహెచ్ సుబ్బారెడ్డి, వజ్రాల ధనలక్ష్మి, వజ్రాల శ్రీనివాస్‌రెడ్డి, కాళంగి తిరుపతిరావు, ఏలియా, ఆళ్ల అమ్మిరెడ్డి పాల్గొన్నారు.



యూరియా పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి-ఎ.కొండూరు: చీమలపాడు కోపరేటివ్ సహకార సంఘం పరిధిలో ఉన్న ఐదు గ్రామాల్లోని రైతులకు అవసరాలకు సరిపడా యూరియా అందజేస్తున్నటున్న పిఎసిఎస్ చైర్మన్ బెజవాడ శంకర్ తెలిపారు. సోమవారం చీమలపాడులోని సహకార సొసైటీ వద్ద యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రెండు రోజుల్లో చీమలపాడు సహకార సొసైటీకి 40 టన్నుల యూరియా సరఫరా అయ్యిందన్నారు. రెండు రోజుల్లో మరో 25 టన్నుల యూరియాను తీసుకురావడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. చీమలపాడు, రామచంద్రపురం, గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు మార్క్‌ఫెడ్ ద్వారా వచ్చిన 20 టన్నుల యూరియాను వ్యవసాయ శాఖ అధికారి తప్పుదోవ పట్టించి ప్రైవేటు ఎరువుల దుకాణాలకు తరలించడం వల్ల యురియా కొరత వచ్చిందన్నారు.



బార్‌ను తరలించాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ: అజిత్ సింగ్ నగర్ డాబా కొట్లుసెంటర్, లూనా సెంటర్‌కు వెళ్లే దారిలో నివాస ప్రాంతాల మధ్య ఉన్న రూప లక్ష్మీ సాయి రెస్టారెంట్ అండ్ బార్‌ను తరలించాలని ఎక్సైజ్ శాఖ సూపరింటెండ్ంట్‌ను ఐద్వా నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీ బార్‌కు ఎదురు రోడ్లోనే రైతు బజారు, మసీదు దగ్గరగా ఉన్నాయని, నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మహిళలు నడవగలిగే పరిస్థితి లేదని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బార్‌ను వెంటనే తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ అధ్యక్షురాలు ఎస్కే షకీలా, ఆషా, జి. సుజాత పాల్గొన్నారు.



ట్రంప్ వ్యాఖ్యలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-తిరువూరు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కార్ భారత ప్రయోజనాలు, సార్వభౌమత్వం దెబ్బతినే విధంగా చేసిన వ్యాఖ్యలను కేంద్ర ప్రభుత్వం ఖండించకపోవడం శోచనీయమని సిపిఎం సీనియర్ నాయకులు జి.వెంకటరత్నం, ఎస్వీ.భద్రం అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం తిరువూరు బోసుబొమ్మ బస్టాప్ సెంటర్‌లో నిరసన తెలిపారు. అమెరికా పెత్తందారులు దేశాన్ని అవమానపరుస్తూ ప్రకటన చేస్తున్నా మోడీ ప్రభుత్వం నోరు మెదపకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.చింతయ్య, బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, సిహెచ్ సురేష్, పంతంగి శ్రీనివాసరావు, షేక్ నాగుల్ మీరా, సత్తార్, కె వెంకటరత్నం, ఎం ఇశ్రాయేలు, బి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమాజ ఇతివృత్తాలే కథలకు ప్రేరణ



ప్రజాశక్తి-విజయవాడ సిటీ : సమాజంలో చుట్టుపక్కల జరిగే సంఘటనలు, ఇతివృత్తాలే కథా రచనకు అవసరమైన ప్రేరణ అందిస్తాయని కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు కథా రచన పోటీల బహుమతి ప్రదానోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ కథలను సమాజ ప్రతిబింబాలుగా వర్ణించారు. చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా, నేర్పుగా చెప్పటం కథకు ఆదరణ తీసుకువస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్ మాట్లాడుతూ ప్రముఖ కథా రచనలను విద్యార్థులు అధ్యయనం చెయ్యాలని, వివిధ రచనా రీతులను విమర్శనా పూర్వకంగా పరిశీలించాలని సూచించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి.నాగరాజు మాట్లాడుతూ మొత్తం 52 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. కె.దివ్య, ఎం.ఝాన్సీలక్ష్మి, ఎం.లక్ష్మీ ప్రసన్న వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ వి.పవన్ కుమార్ రెడ్డి, ప్రఖ్య నాగరేఖ తదితరులు పాల్గొన్నారు.



15 మందితో నూతన కమిటీ

ప్రజాశక్తి-వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలో సిఐటియు మండల మహాసభ సుబ్బమ్మ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కె.కమల మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 15 మందితో సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేట మండలం ఐద్వా నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. సత్తుపల్లి రోడ్డులో జరిగిన మహాసభలో ముందుగా ఐద్వా జెండాను సీనియర్ మహిళా నాయకురాలు ఒడిత్య బేబీ ఎగురవేశారు. అధ్యక్షులుగా కరెడ్ల ధనలక్ష్మి, కార్యదర్శిగా వినుకొండ రంగారాణి, ఉపాధ్యక్షురాలుగా కళ్యాణి భవాని జ్యోతి, పెంద్ర లక్ష్మి సుబ్బలక్ష్మి బేబీ రాహేలు కృష్ణవేణి, కమిటీ సభ్యులుగా లక్ష్మి సుజాత, లక్ష్మీ దుర్గ భవాని స్వాతితో కమిటీ ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఝాన్సీ, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞానరత్నం, రైతు సంఘం నాయకులు పులిబల్ల ఏడుకొండలు, గద్దల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లారీడ్రైవర్, క్లీనర్ల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలో లారీ డ్రైవర్ యూనియన్ కార్యాలయాన్ని సోమవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లారీ డ్రైవర్ల సంక్షేమం పట్ల పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. లారీ ఓనర్లపై విధిస్తున్న ట్యాక్స్, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి మహేష్, మణికంఠ గోపి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని శ్రీరాంపురం, ముచ్చినపల్లి పిఎసిఎస్‌లో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ అధ్యక్షుడు నాదెళ్ల చెన్నకేశవరావు మాట్లాడుతూ సరైన సమయంలో రైతాంగానికి యూరియా సరఫరా చేసేందుకు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాదు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల నిరసన

ప్రజాశక్రి-జగ్గయ్యపేట

నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాది కోట దేవదాసుపై పోలీసుల అక్రమ చర్యలను నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణ అమలుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సామినేని రాము, దాసరి నాగేశ్వరావు, గొనెల వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాస గౌడ్, ఎం ఆంజనేయులు, కే శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, దేశింగ్ రాజు, గంటా కృష్ణంరాజు, జగ్గజీవన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

18న ముఠా వర్కర్స్ యూనియన్ మహాసభ

ప్రజాశక్తి-విజయవాడ: ముఠా రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 18వ తేదీన రాఘవయ్య పార్క్ వద్ద మాకినేని బసవపున్నయ్య విద్యాన కేంద్రంలో జరిగే మహాసభలో ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గవర్నర్‌పేట అలీ బేగ్ స్ట్రీట్ ముఠా సెంటర్ వద్ద సోమవారం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఠా కార్మికులు సిఐటియు అండతో అనేక సమస్యలు పరిష్కరించుకున్నారని చెప్పారు. ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్నా అధికారంలో ఉన్న పాలక పార్టీలు పెడ చెవిన పెడుతున్నాయన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరగబోయే పోరాటాలలో ముఠా కార్మికులు పెద్ద ఎత్తున



పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు విజయవాడ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.బ్రహ్మయ్య ఎం.సీతారాములు, సిహెచ్.నరసింహులు, డి.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో కృష్ణలంక కార్మికుల అడ్డా వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తూర్పు నగర కార్యదర్శి రాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 15న విజయవాడలో ఉన్న రాష్ట్ర లేబర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, బాష, హుస్సేన్, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'లో 152 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి- కలెక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందే అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశ హాలులోడిఆర్ఓ కె చంద్రశేఖర రావు కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మెప్మా పీడీ సాయిబాబు, డి.ఎస్.పి సిహెచ్ రాజులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. తొలుత జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 28,572 అర్జీలు అందగా 26,488 అర్జీలు పరిష్కరించడం జరిగిందని, 283 అర్జీలు తిరిగి తెరిచారని, వాటిని కలుపుకొని ఇంక 1,801 అర్జీలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. కొందరు జిల్లా అధికారులు ఇంకా 70 అర్జీలను ఇప్పటివరకు చూడకపోవడం సరైంది కాదని స్పష్టం చేశారు. మొత్తం 152 అర్జీలు అందినట్లు కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, డిఆర్డిఏ, డ్వామా పీడీలు హరిహరనాథ్, శివప్రసాద్, డిపిఒ అరుణ, ఆర్డబ్ల్యుఎస్ ఈఈ నటరాజు, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మా వతి, డిఎస్ఓ మోహన్ బాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిద్ధం : ఎస్పీ

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 42 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నేత్రదానం జరిగింది.. చల్లపల్లి కి చెందిన ప్రముఖులు వక్కల గడ్డ రాధాకష్ణ, ఉప్పల రామమోహనరావులు సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. సమాచారం తెలుసుకున్న వాసవి క్లబ్ ప్రతినిధులు అన్నవరపు లక్ష్మి గోళ్ల పూర్ణచంద్రావులు మృతుల కుటుంబ సభ్యులకు నేత్రదా నంపై అవగాహన కల్పించారు.కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. విజయవాడకు ఎల్. వి ఆసుపత్రి టెక్నీషియన్ చల్లపల్లి కి వచ్చి మృతి చెందిన ఇరువురి కార్నియాలను సేకరించారు. క్లబ్ సభ్యులు అన్నవరపు సతీష్ కుమార్, మాజేటి పాండురంగారావు సహకారం అందించారు. జడ్పిటిసి సభ్యురాలు రాజుల పాటి కళ్యాణి, శివ ప్రసాద్, సాంబశివరావు పాల్గొన్నారు.

మండలి కృష్ణారావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు. సోమవారం రాజీవ్ సెంటర్లోని ఎంవీ కష్ణారావు విగ్రహానికి అవనిగడ్డ పిఏసిఎస్ అధ్యక్షులు మాదివాడ రత్నారావు పూలదండలు వేసి నివాళులర్పించారు. మండలి వెంకటకష్ణారావు శత జయంతి వేడుకల కమిటీ గాంధీ క్షేత్రం మండల అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఎలవర్తి చిన్న, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన



గుడివాడలో నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సోమవారం రాజుపేట సెంటర్లో కార్మికులు నిరసన చేపట్టారు. సెప్టెంబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నాకు పిలుపు ఇవ్వడంతో సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. మచిలీపట్నం సిఐటియు మండల కన్వీనర్ చిరువోలు జయరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యూ తాపీ పనివారల కూలీల సంక్షేమ సంఘం రాజుపేట కార్యదర్శి మీర్ అక్బర్ ఆలీ, రాజుపేట తాపీ పని వారల కూలీల సంక్షేమ సంఘం నాయకులు ఎండి మహమ్మద్, ఎ కిషోర్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామిని వెంటనే నెరవేర్చాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రేపాని కొండ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏలూరురోడ్డులో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొండ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా బోర్డు పునర్నించకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వెల్ఫేర్ బోర్డును నిర్మించాలన్నారు. ఈనెల 15న విజయవాడ రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని భవన నిర్మాణ కార్మికులందరూ తప్పక హాజరు కావాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు మండల సత్యనారాయణ. పట్టణ అధ్యక్షులు ఓలేటి సీతారామయ్య, వడ్డెర వత్తిదారుల సంఘం పట్టణ ఉపాధ్యక్షులు బండి శ్రీను. మూడేడ్ల నారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత సాధనలో ఉల్లాస్ కీలక భూమిక : కలెక్టర్



ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : సంపూర్ణ అక్షరాస్యత సాధనలో ఉల్లాస్ కార్యక్రమం కీలక భూమిక వహిస్తోందని జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ తెలిపారు. వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో 59వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని సోమవారం జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, వయోజన విద్యా ఉపసంచాలకులు ఎండి. హాజీబేగ్ అక్షరాస్యతా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 73,237 మంది నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకొని అక్షరాస్యత సాధనకు చర్యలు చేపట్టామన్నారు. గత విద్యా సంవత్సరంలో విశేషంగా కృషి చేసిన 14 మంది వాలంటీర్ టీచర్లకు ప్రశంసాపత్రాలు జేస్తున్నామన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా అమలు చేసి నూరు శాతం అక్షరాస్యత సాధించాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ నుండి ర్యాలీ నిర్వహించగా, వయోజన విద్యా సిబ్బంది, ఉల్లాస్ వాలంటీర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఇమామ్, మౌజామ్లకు పెండింగ్ లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన నిర్వహించారు. తొలుతధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవ వేతనం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. గౌరవ వేతనాన్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. వైసీపీ మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని పెంజెంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల కో ఆప్టేడ్ సభ్యులు, పిఎసిఎస్ అధ్యక్షులు బొప్పన శివప్రసాద్ విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ ను సోమవారం పంపిణీ చేశారు. సుమారు 8 వేల రూపాయలతో నోట్ పుస్తకాలు, పెన్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా ప్రతి రోజు పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందించేందుకు గాను సంవత్సరం మొత్తానికి సుమారు 8వేల రూపాయలు ఖర్చు సేవా దక్పథంతో విరాళం ప్రకటించారు. దాత శివప్రసాద్కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మహాలక్ష్మి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

గరికపాటి రాజారావుకు నివాళి

ప్రజాశక్తి-ఉయ్యూరు : తెలుగు సినీ దర్శకుడు, నాటక రంగ ప్రముఖుడు, ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు గరికపాటి రాజారావు 62వ వర్ధంతి సోమవారం ఉయ్యూరులోని శ్రామిక భవనంలో ఆయన చిత్రపటానికి సీనియర్ రంగస్థలం కళాకారుడు వై వి నాంచారయ్య నాయుడు పూలమాలవేసి ఘనమైన నివాళులు అర్పించారు. మద్రాసు సినీ రంగ పరిశ్రమకు అనేకమంది నటులను కళాకారులను సంగీత నత్య కళాకారులను పరిచయం చేశారని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు కె కొండల బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరకతపల్లి వెంకటేశ్వరరావు వీరంకి చంద్రశేఖర్ నెమ్మాది గోపాల్ కె శివ నాగేంద్రం అనిల్ కుమార్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ఎందరో రంగ స్థల సినీ కళాకారులను ఆంధ్ర దేశానికి అందించిన ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు డా॥ గరికపాటి రాజారావు ధన్యజీవి అని పలువురు వక్తలు నివాళులు అర్పించారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో డాక్టర్ గరికపాటి రాజారావు 62వ వర్ధంతి సభ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్ర అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ రాజారావు చిత్రపటానికి సాహితీ స్రవంతి కోశాధికారి, రంగస్థల నటులు యలమర్తి కోటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. సభ్యులు అవిరినేని వెంకటేశ్వరరావు, వల్లభాపురపు కష్ణకిషోర్అభ్యుదయ గీతాలను ఆలపించగా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.సి.పి.రెడ్డి, ఐద్వా నాయకురాలు పి.రజని, గానుగల త్రిమూర్తులు, కొమ్ముల సురేష్ పాల్గొన్నారు.


ఉయ్యూరు, గుడివాడలలో రాజారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పామర్తి సుబ్బారావుకు నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : నిద్రపోతూ కనేది కల, కళ్ళతో అభినయించేది కళ అటువంటి కళారంగం ద్వారా దేశసేవ ప్రధానంగా జాతీయ ఉద్యమాలకు తోడ్పడి, ఎంతో మందికి కళా రంగంలో జీవితాన్ని ప్రసాదించిన మహానుభావుడు పామర్తి సుబ్బారావు అని ప్రభాకర నాట్యమండలి కార్యదర్శి మట్టా రాజా, ప్రముఖ రేడియో ఆర్టిస్టు మాడుగుల రామకృష్ణలు అన్నారు. సోమవారం స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళామందిరంలో ప్రభాకర నాట్యమండలి ఆధ్వర్యంలో పామర్తి సుబ్బారావు 103వ జయంతి వేడుకలు నిర్వహించి ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

కప్పలదొడ్డిలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-గూడూరు : సంకల్ప స్పెషల్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో దేవల మహర్షి వీవర్స్ సొసైటీలో సోమవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మహిళా చట్టాలు,ముఖ్యముగా బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, గృహహింస పనిచేయు ప్రదేశాల్లో జరుగు లైంగిక వేధింపులు వరకట్నం, హిందూ వివాహ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ జడ్జ్ కె. వి. రామకష్ణయ్య మాట్లాడుతూ ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ప్రతి మహిళకు ఉందని, ఎలాంటి విపక్ష చూపకుండా తగు సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ముసలయ్య, ఐ సి డి ఎస్ పి డి .ఎం ఎల్ రాణి , సిడిపిఒ కె గ్లోరీ,ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషశ్రీ, గ్రామ సర్పంచ్ యక్కల మాధవి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకంతో మహిళలకు లబ్ధి : డిఎం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి మహిళల ఉచిత ప్రయాణం పథకం కింద గత నెల 15వ తేదీ నుండి సెప్టెంబర్ 7వ తేదీ వరకు అవనిగడ్డ డిపో బస్సులలో ఇప్పటివరకు నాలుగు లక్షల 36 వేల 67 మహిళలు ఉచిత ప్రయాణం చేసి 61 శాతం మందికి రూ ఒక కోటి 55 లక్షల 75 వేల 450 రూపాయల ఆర్థికంగా లబ్ది పొందారని అవనిగడ్డ డిపో మేనేజర్ కె హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పథకం మొదలు పెట్టిన దగ్గర నుండి ఇప్పటివరకు డిపో పరిధిలో మొత్తం7,18,285 మంది ప్రయాణికులు ప్రయాణం చేయగా శ్రీ శక్తి పథకం ద్వారానే 4,36,067 మంది మహిళలు ప్రయాణం చేసినట్లు తెలిపారు.

సూపర్ సిక్స్ సభను విజయవంతం చేయాలి : కొనకళ్ల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ ద్వారానే సమాధానం చెబుదామని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అన్నారు.. ఈనెల 10న అనంతపురంలో జరగబోయే విజయోత్సవ సభకు సంబంధించి మాట్లాడుతూ ఎవరు ఊహించని విధంగా 14 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామన్నారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన పథకాలు అమలు చేసి మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారన్నారు.

పిన్నమనేని కోటేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని పోలుకొండ గ్రామంలో పిన్నమనేని కోటేశ్వరరావు జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య, ఆరికపూడి రామశాస్త్రి పాల్గొన్నారు. ముందుగా కోటేశ్వరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులు గ్రామస్తులు ఏర్పాటు చేసిన కేకును వెంకటేశ్వరరావు నాయకులతో కలిసి కట్ చేశారు. విగ్రహ ప్రధాన కర్త చింతా వెంకయ్య గ్రామ కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు పర్వతనేని చిన్నబాబు. గొట్టుముక్కల బోసు

చంద్ర గ్రహణం వీక్షణం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్రాంతి హై స్కూల్లో ఆదివారం నిర్వహించిన చంద్రగ్రహణ వీక్షణ కార్యక్రమం విజయవంతమైంది. విద్యార్థులు చాలా ఆసక్తిగా చంద్ర గ్రహణాన్ని వీక్షించారు. ఈ తరం విద్యార్థులు మూఢ నమ్మకాలను వీడాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు, క్రాంతి హై స్కూల్ కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు పెట్ల కామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నందిగామ: జయప్రద ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య సేవలు సామాన్యులకు ఎంతో ఉపయోగమని గోళ్లమూడి సొసైటీ ఛైర్మన్ గాడిపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గోళ్లమూడి గ్రామంలో సోమవారం జయప్రద ఫౌండేషన్, సొసైటీ అధ్యక్షులు గాడిపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 300 మందికి పైగా కంటి పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో తోట నాగమల్లేశ్వరరావు (బుజ్జి), బత్తిన రవి, తొర్రగుడిపాడు సర్పంచ్ చెరుకూరి హైమారావు, మన్నెం కళావతి, మాగల్లు సొసైటీ ఛైర్మన్ అప్పారావు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని రెడ్డిగూడెం, కుదప గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు చర్యలు ప్రారంభించినట్లు రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావు, కుదప గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మల్లాది రాణి, బలగాని రాధమ్మ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు

ప్రజాశక్తి-నందిగామ: ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా అనాసాగరం డివిఆర్ కాలనీ లో అనాసాగరం మండల పరిషత్ మోడల్ స్కూల్ ఆద్వర్యంలో గ్రంథాలయ ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్ఎం ఎ. శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు ఎం. హనుమాన్ రాజు లు సోమవారం కాలనీలో పర్యటించారు. కాలనీలో అక్షరాస్యులను గుర్తించేందుకు మహిళలు, పురుషులకు, యువకులు చదువు కునే విధంగా పుస్తకాలు, దినపత్రికలు ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రం వద్ద ప్రతిరోజు రెండు దినపత్రికలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పుస్తకాలు, కథల పుస్తకాలు, పత్రికలు అందజేయటానికి హనుమాన్ రాజు ముందుకు వచ్చారు.



కళా వేదిక పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వత్సవాయి: పెనుగంచిప్రోలు శ్రీ స్వామి పుల్లయ్య మెమోరియల్ ఉన్నత పాఠశాలలో స్వామి గోపాలరావు ఆధ్వర్యంలో కళావేదిక నిర్మాణ పనులను ప్రధానోపాధ్యాయులు నక్కా బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ విద్య అభివృద్ధి కోసం తాను సొంత నిధులను ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గోపాలరావును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి- నందిగామ: నందిగామ కెవిఆర్ కాలేజి పోస్టాఫీసు సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు బైక్ పై వచ్చి మార్నింగ్ వాక్ చేసి వెళ్తున్న మనోహర్ దేవి మెడలో 70 గ్రాముల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యారు. గొలుసు విలువ సుమారు 7 లక్షల రూపాయలు ఉంటుందని మహిళ నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిఒక్కరూ నేత్రదానాన్ని ప్రోత్సహించాలి



ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: ప్రతిఒక్కరూ నేత్రదానాన్ని ప్రోత్సహించాలని, నేత్రదానం అనేది జీవితాలను మార్చగల శక్తిని కలిగి ఉన్న ఒక గొప్ప చర్య అని వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ అన్నారు. నేత్రదానం ప్రోత్సహించాలని కోరుతూ సోమవారం విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీని నిర్వహించారు. వీరపాండియన్ ముఖ్య అతిథిగా పాల్గొని అగర్వాల్ ఐ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.కె.ఎస్.చక్రవర్తితో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరపాండియన్ మాట్లాడుతూ నేత్రదానంపై అవగాహన కల్పించేందుకు ముందుకొచ్చిన డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి నిర్వాహకులను ఆయన అభినందించారు. డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ ర్యాలీ ద్వారా ఎక్కువ మంది పౌరులు ముందుకొచ్చి వారి కళ్లను ప్రతిజ్ఞ చేయడానికి ప్రేరేపించాలని, తద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో తాము ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్నియా స్పెషలిస్ట్ డాక్టర్ శ్రావణి, ఎన్‌పిసీబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.సునీల్‌కుమార్, ఎన్‌టీఆర్ జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సుహాసిని, కంటి వెలుగు ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ ఇ.ఎస్.ఎన్.మూర్తి, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సమరం, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ వాకాటి జయకుమార్ రెడ్డి, అగర్వాల్ ఐ బ్యాంక్ జీఎం రాజీవ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ ఎం.రామ్, లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యానికి కళలు దోహదం



మాట్లాడుతున్న రంగారెడ్డి


ప్రజాశక్తి-తిరువూరు: ప్రజా చైతన్యానికి కళలు దోహదపడాలని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి.వి.రంగారెడ్డి ఆకాంక్షించారు. ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుల్లో ముఖ్యులైన డాక్టర్ గరికపాటి రాజారావు 69వ వర్ధంతిని మండలంలోని మల్లేల గ్రామంలో, తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు చిత్ర పటానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయడంలో డాక్టర్ రాజారావు కళారూపాలను విస్తృతంగా ప్రదర్శనలు చేశారని రంగారెడ్డి గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడంలో జన జాగృతికి కళలు ఇతోధికంగా దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రూరల్, తిరువూరు పట్టణ అధ్యక్షులు డి.ఏసుపాదం, కె.వెంకటరత్నం, నాయకులు సాంబారు వెంకటేశ్వర్లు, నాయకులు ముత్తయ్య, ఎన్.రవి, పంతంగి తులసీరాణి, ఎం.నాగమణి, వి.రాణి, రాజేశ్వరి, దాదూ, రవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11 విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్11 అల్ట్రా, గెలాక్సీ ట్యాబ్ ఎస్11ను ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ ఇంచార్జి కె.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఇప్పటివరకు అత్యంత తెలివైన, అధునాతన టాబ్లెట్ అనుభవాన్ని అందిస్తుందన్నారు .గెలాక్సీ ట్యాబ్ ఎస్11 సిరీస్, ప్రో-గ్రేడ్ హార్డ్‌వేర్‌నుపెద్ద స్క్రీన్ కోసం ఆప్టిమైజ్ చేసిన అనుభవాలతో కలపడం ద్వారా ప్రయాణంలో అప్రయత్నమైన ఉత్పాదకత కోసం నిర్మించబడిందని తెలిపారు. గెలాక్సీ ట్యాబ్ ఎస్11 అల్ట్రా ఇప్పటివరకు వచ్చిన గెలాక్సీ ట్యాబ్‌లలో అత్యంత సన్ననిదని అన్నారు. పనితీరులో రాజీ పడకుండా, ఇది ఒక ప్రీమియం టాబ్లెట్ ఎలా ఉండగలదో చూపించడానికి సన్నని ఫార్మ్ ఫ్యాక్టర్‌ను మించిపోతుందన్నారు. గెలాక్సీ ట్యాబ్ ఎస్11 అల్ట్రా కేవలం 5.1 మిమీ మందం, 692 గ్రాముల బరువు మాత్రమే ఉంటుందని తెలిపారు.

'మత్తు' అనర్థాలపై అవగాహన

విజయవాడ: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విజయవాడ కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోర్డినేటర్స్ జాకబ్ రాజు, కే ప్రియాంక, నజ్మా, జె జ్యోతి చంద్రిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి పద్మలత తదితరులు పాల్గొన్నారు.



హోమియోపతి ఆసుపత్రి తెరవాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-మైలవరం: గత ఆరు నెలలుగా మూతపడి ఉన్న హోమియోపతి వైద్యశాలను తెరవాలని సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని పుల్లూరులో గత రెండు దశాబ్దాల క్రితం హోమియో వైద్యశాలను ప్రారంభించారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి ఇటీవల బదిలీపై వెళ్లడంతో మరో వైద్యాధికారి రాకపోవడంతో ఆసుపత్రి మూతపడింది. ప్రతిరోజు రోగులు వచ్చి వెనుతిరిగి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఆరు నెలలుగా వైద్యాధికారి లేకపోవడంతో ఆసుపత్రి మూతపడుతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పలు రకాల వ్యాధులకు మైలవరం మండలంతో పాటు ఎ.కొండూరు మండలం నుండి కూడా పుల్లూరు హోమియో వైద్యశాలకు రోగులు వస్తుంటారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి హోమియో వైద్యశాలలో డాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, రావూరి రమేష్ బాబు, నాయకులు లంక వెంకటేశ్వరరావు, సిహెచ్ సుబ్బారెడ్డి, వజ్రాల శ్రీనివాస్‌రెడ్డి, వజ్రాల ధనలక్ష్మి, ఎ.కొండూరు మండలం కమిటీ సభ్యులు తిరుపతిరావు, జె.వెంకటేశ్వరరావు, ఏలియా, ఆళ్ల అమ్మిరెడ్డి పాల్గొన్నారు.





కలుషిత నీటిని అరికట్టాలి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : 50వ డివిజన్లోని మహంతిపురం అప్పలస్వామి వీధి తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో మురుగునీరు వస్తుందని స్థానిక ప్రజలు కార్పొరేటర్ బి.సత్యబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో సోమవారం సత్యబాబు పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ ధ్యాన్చంద్రకు, అధికారులకు సమస్యను తెలిపారు. మంచినీటి కాలుష్యాన్ని అరికట్టి స్వచ్ఛమైన మంచినీరు ప్రజలకు అందించాలని కోరారు. ఈ నెల 16న జరిగే కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యలపై సభ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు లక్ష్మి, మంగ, బేగం తదితరులు పాల్గొన్నారు.

టయోటా ధరల తగ్గింపు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) జీఎస్టీ రేటు తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు పూర్తిగా అందించనున్నట్లు సంస్థ సేల్స్ హెడ్ వీరేందర్ వాద్వా తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. సవరించిన ధరలు ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపారు. ఈ నిర్ణయం వినియోగదారుల కొనుగోలు శక్తిని పెంచడమే కాకుండా ఆటోమొబైల్ రంగంపై ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసిందని తెలిపారు.

సమావేశం బహిష్కరణ

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం వైసీపీకి చెందిన పాలకవర్గ సభ్యులు ఎంపీపీ, జెడ్పీటీసీ బహిష్కరించారు. ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన జరగాల్సిన ఈ సమావేశం ఆమె కూడా బాయ్‌కాట్ చేయటంతో ఎంపిడిఓ రవి కుమార్, తహశీల్దార్ ఉదయ్ భాస్కరరావుతో కలిసి సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులమైన తమను పిలవడం లేదని, వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన లక్ష్మీపురం సొసైటీ భవనం ప్రారంభోత్సానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసిలను పిలవకపోగా శిలాఫలకంలో తమ పేర్లు కూడా లేవని, ప్రోటోకాల్ ఎందుకు పాటించలేదని జడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి ఎంపీడీవోను నిలదీశారు. వైసీపీకి చెందిన వారిని అగౌరపరుస్తున్నందన సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ఆయన చెప్పారు.